క్లుప్తంగా

ఘనంగా దశాబ్ది ఉత్సవాలు



కొందుర్గు : తంగెళ్లపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

కొందుర్గు: దశాబ్ది ఉత్సవాలు కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం గ్రామాల్లో సాధించిన ప్రగతి నివేదికపై చర్చించి, ర్యాలీలు నిర్వహించారు. వివిధ గ్రామాల్లో వనభోజనాలు చేశారు. కొందుర్గు మండలం చెర్కుపల్లి ప్రాథమిక పాఠశాలలో గురుకుల పాఠశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులను శాలువాలతో సత్కరించారు. పాఠశాల హెచ్‌ఎం శివారెడ్డి, విద్యార్థులను ఎంఈఓ కృష్ణారెడ్డి అభినందించారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు సన్మానం



కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న నేతలు

షాద్‌నగర్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన శ్రీవర్ధన్‌రెడ్డి, అందెబాబయ్యలను గురువారం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ నేతలు వారికి శాలువాలు కప్పి, స్వీట్లు తినిపించారు. కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, వంశీకృష్ణ, మురళీ, సాయిబాబ, మోహన్‌సింగ్, ప్రదీప్, సుధాకర్ అప్ప, కిషోర్‌రెడ్డి, హన్మంత్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన నాయకులు



రేవంత్ రెడ్డిని కలిసిన నాయకులు

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాలకు సంబంధించిన వివిధ గ్రామాల నాయకులు గురువారం పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డిని కలిశారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్ ఆధ్వర్యంలో పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరినట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, కావలి రాజు తెలిపారు.

బండి సంజయ్‌ని కలిసిన నేతలు



సంజయ్‌ను కలిసిన నాయకులు

షాద్‌నగర్‌రూరల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని గురువారం షాద్‌నగర్ బీజేపీ నేతలు కలిశారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గంలో షాద్‌నగర్‌కు చెందిన నేతలు శ్రీవర్ధన్‌రెడ్డి, అందెబాబయ్యను రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మర్యాదపూర్వకంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

మూడవసారి కూడా బీఆర్‌ఎస్‌దే అధికారం

మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం



ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం

మొయినాబాద్: సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలే మూడవసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రాబోతుందని మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం అన్నారు. మండలంలో గురువారం మేడిపల్లి, ఎల్కగూడ, కుత్బుద్దీన్‌గూడ, వీరన్నపేట గ్రామాల్లో పల్లెపల్లెకు రత్నం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లో ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు ఏ మేరకు అందుతున్నాయనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని తీసుకున్నట్లు చెప్పారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు హన్మంత్‌రెడ్డి, మోహన్‌గౌడ్, భాస్కర్, నీలకంఠం, రాంరెడ్డి, రాంచందర్, మాజీ సర్పంచ్ నవీన్, ప్రభాకర్, మహేందర్, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్, యాదయ్య ఉన్నారు.

ప్రగతిపథంలో పల్లెలు

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



షాద్‌నగర్‌రూరల్: ఎమ్మెల్యేకు బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లెప్రగతి పథకంతో గ్రామాల రూపురేఖలు మారిపోయాయని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం ఫరూఖ్‌నగర్ మండలంలోని ఎలికట్టలో సర్పంచ్ సాయిప్రసాద్‌యాదవ్ ఆధ్వర్యంలో పల్లెప్రగతి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు మహిళలు బోనాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. పల్లెప్రగతిలో భాగంగా దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి పథకాలతో పల్లెలు ప్రగతిపథంలో పయనిస్తున్నాయని అన్నారు. ఆనాడు నై తెలంగాణ అన్నోళ్లు నేడు సై తెలంగాణ అంటున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్లేష్‌పూజారి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మన్నె కవితనారాయణయాదవ్ ఎంపీపీ ఖాజాఇద్రీస్‌అహ్మద్, జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఏపీఓ అరుణ, పంచాయతీ కార్యదర్శి తేజస్విని, వార్డు సభ్యులు విజయలక్ష్మి, నీరజ, విజయలక్ష్మి, పావని, అనిత, మహిళా సంఘం అధ్యక్షురాలు సుమిత్ర, నాయకులు అంగన్‌వాడీ టీచర్లు,ఆశ వర్కర్లు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పల్లెలన్నీ పచ్చటి వనాలుగా మారాయి..

శంకర్‌పల్లి: సీఎం కేసీఆర్ పాలనలో పల్లెలన్నీ పచ్చటి వనాలుగా మారడంతో పాటు అభివృద్ధిలో ముందంజలో ఉన్నాయని ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని గ్రామాల్లో పల్లె ప్రగతి దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి, పల్లె ప్రకృతి వనాల్లో అధికారులు, నాయకులు, పారిశుద్ధ్య కార్మికులు, గ్రామస్తులతో కలిసి వనభోజనాలు చేశారు. పారిశుద్ధ్య సిబ్బందికి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలో ఆదర్శంగా నిలిచాయన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల చూపు తెలంగాణ రాష్ట్రంపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి జెడ్పీటీసీ గోవిందమ్మ, ఎంపీడీఓ వెంకయ్యగౌడ్, ఎంపీఓ గీత, తహసీల్దార్ నయిముద్దీన్, ఉప తహసీల్దార్ ప్రియాంక, ఏపీఓ నాగభూషణం, సర్పంచ్‌లు రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, లలిత, నర్సింహారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, అశ్విని, సుమిత్ర, కార్యదర్శులు గ్రామస్తులు పాల్గొన్నారు.

పండుగలా పల్లె ప్రగతి ఉత్సవాలు

మొయినాబాద్‌రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాడిన తరువాత పల్లె ప్రగతితో అభివృద్ధి బాటలో గ్రామాలు కళకళలాడుతున్నాయని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మహిళా అధ్యక్షురాలు శోభ అన్నారు. గురువారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 'ప్రగతి బాటలో పల్లెలు' అనే కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మహిళా సంఘాలు, వివిధ శాఖల అధికారులు కలిసి బోనాల ఉత్సవాలు, జెండా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కేతిరెడ్డిపల్లిలో పంచాయతీ కార్యదర్శి తారాబాయి ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. 200 మంది మహిళలు బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డప్పుల దరువులు, పోతురాజుల విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు దారెడ్డి శోభా పాల్గొని బోనాల ఊరేగింపు ప్రారంభించి ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాటను నిలుపుకుంటారని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని 84 గ్రామాలకు శాపంగా, గుదిబండగా ఉన్న 111 జీఓను ఎత్తివేశారని తెలిపారు. గ్రామాల్లో పల్లె ప్రగతిలో భాగంగా పాడుబడ్డ బావులను పూడ్చివేత, శిధిలావస్థకు చేరిన ఇళ్ల కూల్చివేత, పల్లెకో ప్రకృతి వనం, హరితహారం మొక్కల పెంపకం, వైకుంఠధామాల నిర్మాణం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం, గ్రామానికి ఒక నర్సరీ, ఇంటింటికి చెత్త సేకరణ ట్రాక్టర్లు, ఇంటింటికి నల్లా కనెక్షన్‌లు, ఎన్నో కార్యక్రమాలు చేపడుతూ అభివృద్ధి చెందాయన్నారు. అమ్డాపూర్‌లో పంచాయతీ పాలకవర్గం కలిసి నిత్యం పారిశుద్ధ్యం నిర్వహించే కార్మికులను పంచాయతీ సెక్రటరీ, ఉపసర్పంచ్ నాగార్జునచారి కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తారాబాయి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటి మాజీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ సిద్దయ్య, దశాబ్ది ఉత్సవాల్లో గ్రామ ఇన్‌చార్జి లక్ష్మి, వార్డు సభ్యులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

కేశంపేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తోందని స్త్రీ, శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం పల్లె ప్రగతి కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పాపిరెడ్డిగూడ, కేశంపేట గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పాడిన తర్వాత సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. అలాగే, మండలంలోని అన్ని గ్రామాల్లో పల్లె ప్రగతి దినోత్సవ కార్యక్రమాలను సర్పంచులు ఘనంగా నిర్వహించారు. అనంతరం వివిధ గ్రామాల్లో గ్రామ పంచాయతీ కార్మికులను శాలువాలతో సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ అజీంఅలీ, ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీఓ నర్సింలు, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, పల్లెప్రగతి ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి: వన భోజనం చేస్తున్న ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకయ్యగౌడ్



మొయినాబాద్‌రూరల్: బతుకమ్మను ఎత్తుకున్న శోభ

పల్లె ప్రగతి దేశానికి ఆదర్శం

షాబాద్: రాష్ట్రంలో గ్రామ పంచాయతీల సర్వతోముఖాభివృద్ధికి పల్లెప్రగతి కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని జెడ్పీటీసీ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని ముద్యంగూడాలో నిర్వహించిన పల్లె ప్రగతి కార్యక్రమంలో ఆయన సర్పంచ్ జయమ్మతో కలిసి పాల్గొన్నారు. పల్లె ప్రకృతి వనం, మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. అనంతరం రాగి చెట్టుకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

అధిక ఫీజులపై చర్యలు తీసుకోవాలి

కొత్తూరు: మండలంలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసు కోవాలని ఏబీవీపీ మండల కన్వీనర్ నరేష్‌చారి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఆయా పాఠశాలల్లో కనీస వసతులు, సౌకర్యాలు లేకున్నప్పటికీ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తు న్నారని ఆరోపించారు. దానికి తోడు ఫీజుల నియంత్రణ, ఇతర అంశాలపై చర్చించేందుకు వీలుగా కమిటీలను సైతం ఏర్పాటు చే యడం లేదన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు ఆయా ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కేశంపేట: మండల సమావేశం నేడు (శుక్రవారం) నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ రవీందర్‌యాదవ్ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 11గంటలకు జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశానికి మండలఅధికారులు పూర్తి సమాచారంతో రావాలని అ న్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సకాలంలో సమావేశానికి రావాలని ఆయన కోరారు.

ర్యాలీని విజయవంతం చేయండి

కొత్తూరు: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణ ప్రగతి దినోత్సవాన్ని పురస్కరించుకుని నేడు (శుక్రవారం) కొత్తూరు మున్సిపాలిటీలో నిర్వహించే ర్యాలీలో ప్రజలు, కౌన్సిలర్లు పాల్గొని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరణ, పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్స్, మహిళ సంఘాల సభ్యులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఆమె తెలిపారు.

త్వరలో చేవెళ్లకు మున్సిపల్ హోదా

ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలెయాదయ్య



విలేకర్లతో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే, తదితరులు

చేవెళ్ల: ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న చేవెళ్ల ప్రజల మున్సిపాలిటీ కల త్వరలో నెరవేరబోతుందని చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యలు అన్నారు. గురువారం దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న వారు చేవెళ్ల మున్సిపాలిటీగా మారబోతుందని కీలక ప్రకటన చేశారు. కేసీఆర్, కేటీఆర్‌లతో చర్చించిన తరువాతే ప్రకటన చేస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ఎన్నోసార్లు కేటీఆర్, కేసీఆర్‌లను అడిగి ఒప్పించినట్లు తెలిపారు. వచ్చే అసెంబ్లీలో తప్పకుండా మున్సిపాలిటీగా పాస్ చేయిస్తామని చెప్పారు. మున్సిపాలిటీగా మారితే చేవెళ్ల మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అంతేకుండా చేవెళ్ల గ్రామ పంచాయతీలో జరిగిన పల్లె ప్రగతి ఇదే చివరిదని ఇక పట్టణ ప్రగతి జరుపుకుంటామని చెప్పారు. దీంతో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు టపాకాలు కాల్చి, స్వీట్లు తినిపించుకొని సంబరాలు చేసుకున్నారు. వారి వెంట పార్టీ నాయకులు ఎంపీపీ ఎం. విజయలక్ష్మి, జెడ్పీటీసీ ఎం.మాలతి, చేవెళ్ల సర్పంచ్ శైలజ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు ఎం.కృష్ణారెడ్డి, జంగయ్య, దయాకర్, రవీందర్‌రెడ్డి, మల్లేశ్, చంద్రశేఖర్, మల్లారెడ్డి, ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

పరామర్శ

షాబాద్: ఇటీవల గుండెపోటుతో చికిత్స పొందిన మాజీ ఎంపీపీ కూర వెంకటయ్యను జెడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి గురువారం పరామర్శించారు. కూర వెంకటయ్య తీవ్రమైన గుండెపోటుతో ఆస్పత్రిలో చేరగా ఆయనకు అవసరమైన వైద్యం దగ్గరుండి చేయించినా అవినాశ్ రెడ్డి ముద్దెంగూడలోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి మనోధైర్యం నింపారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, నాయకులు లింగం, పాపిరెడ్డి, సుదర్శన్, మల్లారెడ్డి తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: సీఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చెక్కులను అందజేశారు. రంగాపూర్ గ్రామానికి చెందిన జాకారం జంగయ్యకు రూ.1 లక్ష, సోమ మాణెమ్మ కు రూ.36వేలు, కొందుర్గు మండలం పర్వతాపూర్ గ్రామానికి చెందిన పల్లవికి రూ.24వేలు, ఎలికట్ట గ్రామానికి చెందిన ఉడుత రాహుల్ రూ.1లక్షా20వేలు మంజూరు అయ్యాయి. కార్యక్రమంలో గణేష్, నారాయణరెడ్డి, జెడ్పీటీసీ మార్కెట్ కమిటీ చైర్మన్ కవిత, ఎంపీపీ ఖాజా ఇద్రీస్, శ్రీనివాస్‌రెడ్డి, సాయిప్రసాద్ యాదవ్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

కరెంట్ తీగలు వేలాడుతున్న పట్టించుకోరా?

సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌ల గరం గరం



అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులు

కొందుర్గు: గ్రామాల్లో, వీధుల్లో విద్యుత్ తీగలు వేలాడుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ యాదమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. చాలా గ్రామాల్లో కరెంట్ తీగలు వేలాడుతున్న విషయం అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని సర్పంచ్‌లు భూపాలచారి, బాబురావు, బాల్‌రాజ్ తదితరులు వాపోయారు. కాస్లాబాద్‌లో మూడు నెలలుగా మిషన్ భగిరథ నీళ్లు రావడం లేదని సర్పంచ్ గోపాల్ వాపోయారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న వివిధ పనులకు చాలా వరకు డబ్బులు ఖర్చు అవుతున్నాయని, ఈ డబ్బులు తమకు ఎక్కడి నుంచి వస్తాయని సర్పంచ్ భూపాలచారితో పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ బంగారు స్వరూప, వైస్ ఎంపీపీ ఆశ్రాబేగమ్, ఎంపీడీఓ మహేష్‌బాబు, సీడీపీఓ నాగమణి, ఎంఈఓ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి అండగా..



ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ స్వాతి బాలీశ్వర్

కేశంపేట: మండలంలోని కొండారెడ్డిపల్లిలో పెబ్బె యాదమ్మ రాఘులయ్య దంపతులు ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన పల్లె అనంద్‌కుమార్, బాలీశ్వర్‌లు సొంత డబ్బులతో వారికి ఇంటిని నిర్మించేందుకు ముందుకువచ్చారు. గురువారం సర్పంచ్ పల్లె స్వాతి బాలీశ్వర్ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామంలో నిరుపేదలకు అండగా ఉంటూ భూములను, ఇళ్లను నిర్మించి ఇస్తుండడం పట్ల గ్రామస్తులతో పాటు మండల ప్రజలు అనంద్‌కుమార్, బాలీశ్వర్‌లను అభినందిస్తున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శివకుమార్, శిరీష, రాధిక, శోభ, కై సర్, జంగయ్య, అంజయ్య, లక్ష్మయ్య, శేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, శేఖర్, మల్లేష్‌గౌడ్, కృష్ణయ్య, శేఖర్, చెన్నయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం

రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ లయన్స్ నట్‌రాజ్



ధ్రువపత్రం అందజేస్తున్న క్లబ్ సభ్యులు

షాదనగర్: రక్తదానం మహాదానం అని రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ లయన్ నట్‌రాజ్ అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం షాద్‌నగర్‌లోని రాయికల్ టోల్ ప్లాజా వద్ద లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దానం చేసే ప్రతి రక్తపు బొట్టు ఆపదలో ఉన్న వారికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలన్నారు. రక్తాన్ని ఎవరు కృత్రిమంగా తయారు చేయలేరని చెప్పారు. అది కేవలం మానవ శరీరంలో మాత్రమే తయారవుతోందని తెలిపారు. రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని నిర్వహిస్తామని అన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు సాదక్ అలీ, ఇబ్రహీం, ఎంవీఎస్ రంగయ్య, రమాదేవి, సందీప్, అశ్విన్ పటేల్, శివనాగయ్య పాల్గొన్నారు.

మేమంటే ఇంత చులకనా?

డీసీసీబీ డైరెక్టర్ మంజుల రెడ్డి ఆవేదన



విలేకరులతో మాట్లాడుతున్న మంజులరెడ్డి

నందిగామ: మహిళా ప్రజాప్రతినిధినైన తనను పల్లె ప్రగతిలో అవమానపర్చడం ఎంతవరకు సమంజసమని మేకగూడ పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ మంజుల రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆమె విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. పల్లె ప్రగతి దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగురవేసే ముందు కొబ్బరికాయ కొట్టే విషయంలో గ్రామ కార్యదర్శి తనను తీవ్రంగా అవమానపర్చాడని ఆరోపించారు. కేవ లం సర్పంచ్, ఎంపీటీసీలకు మాత్రమే కొబ్బరికాయ ఇచ్చి తనకు ఇవ్వకుండా అవమానపర్చాడని ఆవేదన వ్యక్తం చేశారు. పీఏసీఎస్ చైర్మన్‌గా, డీసీ సీబీ డైరెక్టర్‌గా, గ్రామ మాజీ సర్పంచ్‌గా, అన్నింటికన్నా ఓ మహిళా ప్రజాప్రతినిధి అని కూడా చూడకుండా అవమానపర్చాడని, ఇదీ రైతులందరిని అవమాన పర్చడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె చెప్పారు. సమావేశంలో పీఏసీఎస్ డైరెక్టర్ యాదయ్య, నాయకులు మోహన్,వెంకటేష్ యాదవ్, మహిళా రైతులు ఉన్నారు.

పెళ్లి ధ్రువపత్రం సులభతరం

- గ్రామ పంచాయతీల్లోనే వివాహ రిజిస్ట్రేషన్
- అక్కడే సర్టిఫికెట్ అందజేత
- సద్వినియోగం చేసుకుంటున్న యువజంటలు



తూర్పుగడ్డతండా గ్రామ పంచాయతీ కార్యాలయం

కేశంపేట: వివాహ నమోదును రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరి చేయడంతో యువజంటలు పెళ్లి నమోదుకు ముందుకు వస్తున్నారు. గ్రామ పంచాయతీల్లోనే పెళ్లి రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించడంతో నూతన జంటలకు దూరభారం తగ్గింది. జనన, మరణ నమోదు మాదిరిగానే వివాహాలకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించింది. వివాహాలు చేసుకున్న జంటలు సర్టిఫికెట్ల కోసం తిరగాల్సిన పరిస్థితి లేకుండా వివాహం జరిగిన చోటే గ్రామ పంచాయతీలో వివాహ రిజిస్ట్రేషన్ చేసుకుంటే, పంచాయతీ కార్యదర్శులు సర్టిఫికెట్లను అందజేస్తారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకానికి పెళ్లి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ నమోదు తప్పనిసరి కావడంతో గతంలో ప్రతి జంట నమోదు కోసం షాద్‌నగర్ సబ్‌రిజిష్టర్ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకునేవారు. దరఖాస్తు చేసుకున్న వారం, పది రోజుల తర్వాత సర్టిఫికెట్లు అందజేసేవారు. నమోదుతో పాటు సర్టిఫికెట్లను తీసుకోవడానికి కార్యాలయాలకు వెళ్లి రావడం వ్యయప్రయాసలతో జరిగేది. దీంతో చాలా మంది వివాహ సర్టిఫికెట్లను పొందేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు.

దరఖాస్తు చేసుకునే విధానం...

వివాహ సర్టిఫికేట్ కోసం పెళ్లి జరిగిన ప్రదేశంలో ఉన్న గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలి. వివాహం జరిగిన రోజు నుంచి 21 రోజుల లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వధూవరుల జనన ధృవపత్రాలు, ఆధార్‌కార్డులు, వివాహం జరిగిన పెళ్లి ఫొటోలు, శుభలేఖలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమర్పించాలి. పెళ్లి జరిగినట్లు వధూవరుల తరఫున ఇద్దరు చొప్పున సాక్షి సంతకాలు అవసరం ఉంటాయి. వీరిని కూడా తీసుకెళ్తే అన్నీ పత్రాలను పరిశీలించి పంచాయతీ కార్యదర్శులు సర్టిఫికెట్లను అందిస్తారు.

పెళ్లికి ముందే దరఖాస్తు చేసుకోవచ్చు..

యువతి, యువకులు పెళ్లికి వారం రోజులు ముందుగా కూడా పెళ్లి సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. పెళ్లి పత్రిక, ఇతర పత్రాలు సమర్పిస్తే పంచాయతీ కార్యదర్శి పెళ్లి పందిరిలోనే సర్టిఫికెట్‌ను అందజేస్తారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

నమోదు చేసుకోవాలి



గ్రామ శివారులో ఫంక్షన్ హాల్, గుడి, చర్చి, ఇంట్లో ఎక్కడ పెళ్లి జరిగిన దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి సర్టిఫికెట్లను అందిస్తాం, పెళ్లికి ముందు దరఖాస్తు చేసుకుంటే పెళ్లి రోజే వివాహ నమోదు సర్టిఫికెట్‌ను ఇస్తాం. పెళ్లి నమోదుకు కావాల్సిన అన్ని వివరాలతో పాటు అవసరమైన ఫొటోలను అందించాల్సి ఉంటుంది.

– విద్యావతి, పంచాయతీ కార్యదర్శి, కేశంపేట మండలం

పారదర్శకంగా నమోదు



పారదర్శకంగా పెళ్లి నమోదు సర్టిఫికెట్లను అందజేయడం జరుగుతోంది. గతంలో వివాహ సర్టిఫికెట్ల కోసం షాద్‌నగర్‌కు వెళ్లాల్సి వచ్చేది. అప్పట్లో డబ్బులు, సమయం వృథా జరిగేది. సీఎం కేసీఆర్ ప్రజలకు ఇబ్బందులు కలుగవద్దనే ఉద్దేశంతో గ్రామ పంచాయతీల్లోనే పెళ్లి నమోదుకు అవకాశం కల్పించారు.

– తలసాని వెంకట్‌రెడ్డి, కేశంపేట గ్రామ సర్పంచ్